చెరువు మట్టితో భూసారం పెంపు

- పోషకాల వృద్ధితో అధిగ దిగుబడులు
- తగ్గనున్న రసాయన ఎరువుల వినియోగం


చెరువు మట్టి


రైతుల పొలాల్లో చెరువు మట్టి వేసుకున్న దృశ్యం

బుట్టాయగూడెం: పంట పొలాల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండటం, వర్షపు నీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతూ ఉండడంతో రైతులకు సరైన దిగుబడులు రావడంలేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రసాయన ఎరువుల వినియోగం విపరీతంగా పెరిగి భూసారం తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో రైతులు చెరువుమట్టినే ఎరువుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటి ఉన్నందున ఆయా చెరువుల్లో మట్టిని పంట పొలాల్లో వేసుకుంటే రసాయన ఎరువులకు పట్టే వ్యయాన్ని వీలైనంత వరకూ తగ్గించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలు పడినప్పుడు వరదనీటితో పోషకాలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులకు చేరుతుంది. వేసవిలో నీరు తక్కువగా ఉండడం వల్ల మట్టిని పూడిక తీయడం వల్ల వచ్చే ఏడాది చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. చెరువుల నుంచి తీసిన సారవంతమైన మట్టిని పంట పొలాల్లో వేయడం వల్ల పొలాలు సారవంతమవుతాయి. ఇలా రెండు మూడేళ్ల కొకసారి పొలాల్లో చెరువు మట్టిని వేసుకోవడం వల్ల పొలాలు నీటి కోతకు గురికాకుండా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

చెరువు మట్టితో ఉపయోగాలు

- చెరువు మట్టి పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- చెరువు మట్టి వల్ల నేల గుల్లబారుతుంది. మురుగునీరు పోయేందుకు అవకాశం ఉంటుంది. నీటిని పొలాల్లో ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది.
- సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి పెరుగుతాయి. నత్రజని స్థాయి పెరుగుతుంది.
- మట్టిలో సేంద్రియ పోషకాలు ఉండడంతో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.
- చెరువు మట్టిలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండడం వల్ల నేలలో పోషకాలు పెరుగుతాయి.
- వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.
- సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరిగి అధిగ దిగుబడులకు అవకాశం ఉంటుంది.

భూసారాన్ని పెంచుకోవచ్చు



రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. భూసారాన్ని పెంచుకునేందుకు చెరువు మట్టిని పంట పొలాల్లో వేసిన తర్వాత కలియదున్నితే ఎంతో మేలు జరుగుతుంది. పంట పొలాలకు అవసరమైన అన్ని పోషకాలు లభించి పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి.

– డి. ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా


పంగిడిగూడెం సచివాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, పేదలు

జంగారెడ్డిగూడెం: ఇండ్ల స్థలాలు లేని పేదలకు మూడు సెంట్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంగిడిగూడెం గ్రామ సచివాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీవరత్నం మాట్లాడుతూ పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కె.సుబ్బారావు, ఎం.బాలరాజు, ఎం.అశోక్, సింహాద్రి నాగమణి, జి.పేరంటాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు


ద్వారకాతిరుమల: విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ టోనీ

ద్వారకాతిరుమల: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ ప్రతిభా పురస్కారాలు అందజేసింది. సోమవారం ఏలూరులోని సర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పురస్కారాలు, రూ.20 వేల చెక్కును అందించారు. ద్వారకానగర్ డీపోల్ పాఠశాలకు చెందిన ఐగుదురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం పాఠశాల ఆవరణలో పురస్కారాలను అందుకున్న విద్యార్థులు ఎం.సాయి పూజిత, కె.హర్షవర్ధన్, కె.లక్ష్మీ దుర్గా లావణ్య, ఎం.రామ్ నాగ చైతన్య, పి.ఐశ్వర్యలను ప్రిన్సిపాల్ ఫాదర్ టోనీ అభినందించారు.

టి.నరసాపురం: టి.నరసాపురానికి చెందిన మాటూరి శ్రీరామకృష్ణ సంజయ్‌కుమార్ ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యాడు. సోమవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతుల మీదుగా అవార్డుతో పాటు రూ.20వేల చెక్కును అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవో టి.రామ్మూర్తి, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

కామవరపుకోట: కొత్తూరువారిగూడెం గ్రామానికి చెందిన సీహెచ్ అంజలి స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్ హెచ్‌ఈసీ గ్రూపులో 830 మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ పురస్కారం దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

కొయ్యలగూడెం: బయ్యనగూడెం హైస్కూల్‌కి చెందిన కోరుకొండ స్వామి పదో తరగతి 585 మార్కులు సాధించడంతో షైనింగ్ స్టార్ పురస్కారం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, పార్టీ సీనియర్ నాయకులు పోతన తాతారావు అభినందించారు.

ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ద్వారకాతిరుమల: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులను పాటించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్ సూచించారు. నారాయణపురం గ్రామంలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ఖరీఫ్ కార్యక్రమాన్ని కేవీకే విస్తరణాధికారి డాక్టర్ వి.దీప్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్, అపరాల పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి, అలాగే పత్ర ఆకు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను దుర్గారమేష్ వివరించారు. అనంతరం దీప్తి మాట్లాడుతూ రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను వినియోగించుకోవాలని, అలాగే గ్రామీణ యువతకి కేవీకే నిర్వహించే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. ఆ తరువాత ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించి, మొవ్వ, కాండం కుళ్లును గుర్తించి, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు సూచించారు. గ్రామ సహాయ అధికారి నిహారిక, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

400 మందికి వైద్య సేవలు


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరం వెంకటపతి రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి వైద్యసేవలు అందించినట్లు మాజీ సర్పంచ్ ఎస్ఆర్ నరసింహ రాజు తెలిపారు. ఆశ్రం, వైభవ్ ఆదర్శ్ లయన్స్ క్లబ్, స్కూల్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకరాల వేణుబాబు, విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఎస్ఆర్ఆర్‌పీ సుభద్రాదేవి ప్రారంభించారు. అవసరమైన వారికి ఈనెల 11న ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని చెప్పారు.

బాలికల హైస్కూల్‌ను యథావిధిగా కొనసాగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చింతలపూడిలో 64 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలని యథావిధిగా కొనసాగించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడారు. చింతలపూడి బాలికొన్నత పాఠశాలను అక్కడున్న హెచ్ఎం ప్రోద్బలంతో ఎస్ఎంసీ కమిటీలో తమ అనుకూలస్తులతో తీర్మానం చేయించి బాలికల పాఠశాలగా ఉన్న పాఠశాలని బాల బాలికల(కో ఎడ్యుకేషన్) పాఠశాలగా మార్చడం వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు. ఈ పాఠశాలకి రెండు మూడు కిలోమీటర్ల పరిధిలోని రెండు బాల బాలికల(కో ఎడ్యుకేషన్) పాఠశాలలు ఉన్నప్పటికీ కూడా ఎందుకు మార్చవలసి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలని నాని డిమాండ్ చేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


చింతలపూడి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


వేలేరుపాడు: వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

వేలేరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తానన్న రూ.20 వేలను రెండు సంవత్సరాలకు కలిపి రూ.40 వేలు తక్షణమే ఇవ్వాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్కే గౌస్ డిమాండ్ చేశారు. సోమవారం వేలేరుపాడులో అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘం డివిజన్ కార్యదర్శి కారటం వీరాస్వామి అధ్యక్షతన వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ గౌస్ మాట్లాడుతూ రైతాంగానికి ఉచితంగా ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని. ముంపుతో సంబంధం లేకుండా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి సిరికొండ రామారావు మాట్లాడుతూ పోలవరం ముంపు పేరుతో వెబ్ ల్యాండ్ మూసివేసారని. వెబ్ లాండ్ ఓపెన్ చేయించి రైతులందరికీ రుణాలు మంజూరు చేయించి పట్టా హక్కులు ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.4 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గడ్డల ముత్యాలరావు, పార్టీ డివిజన్ నాయకుడు కట్ట ముత్యాలరావు, మండల కార్యదర్శి కట్టడం రాంబాబు, తిర్లాపురం సర్పంచ్ సోడే విజయ, ఎంపీటీసీ కరటం రత్తమ్మ, ఇందూరి శ్రీను, చిలుకూరు లక్ష్మణ, మిడియం ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు

తహసీల్దార్‌కు కౌలు రైతుల వినతి

చింతలపూడి: భూమిలేని రైతులకు, కౌలు రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంతో పాటు 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల పంట విత్తనాలు అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్కే కాలేషా, కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలకు చెక్


జంగారెడ్డిగూడెం: యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పోలవరం: యోగాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: యోగాతో ఎన్నో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆర్డీవో ఎంవీ రమణ అన్నారు. పట్టణంలో యోగాంధ్ర ర్యాలీని పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎంవీ రమణ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, ప్రజాప్రతినిధులు, సచివాలయ, మెప్మా సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. గుర్వాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన యోగా ర్యాలీని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ జి.సత్యవేణి ప్రారంభించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ద్వారకాతిరుమల: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన ఒక మంచి మార్గమని ఎంపీడీవో పీవీవీ ప్రకాష్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు యోగా సాధనపై అవగాహనా ర్యాలీ, మానవ హారాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగాతో సయాటికా, షుగరు, స్పాండిలైటిస్, అజీర్ణం, వెన్ను నొప్పి, గ్యాస్, అధిక రక్తపోటు, గుండె దడ వంటి శారీరక సమస్యలతో పాటు, మానసిక ఒత్తిడి, ఆందోళన, భయం వంటి మానసిక సమస్యలు కూడా తగ్గుతాయన్నారు. తహసీల్దార్ జేవీ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంఈఓ పి.వెంకట్రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: యోగాపై అవగాహన కల్పిస్తూ పోలవరం గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి యోగా చేయడం వల్ల ఉపయోగాలపై వివరించారు. యోగాంధ్రపై నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు తెలిపారు.

దైనందిన జీవితంలో యోగ భాగం కావాలి

కొయ్యలగూడెం: దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు యోగాంధ్రాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, గొలిశెట్టి వాసు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, చిరవూరి శ్రీనివాసరావు, బలుసు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కంపా సురేష్, పంచాయతీ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

టి.నరసాపురం: స్థానిక మండల పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో జి.నాగరాజకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.శ్రీనివాసులు, ఏపీవో నాగేశ్వరరావు, ఈఓపీఆర్ వి.సంపత్‌కుమారి, పీఈటీ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ట్రాన్స్‌కో టవర్ లైన్‌ల మార్పు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మద్దిలో యోగా దినోత్సవం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం తలపెట్టిన యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో వీరు సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సుమారు 1000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొననున్నందున సచివాలయ సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక

బుట్టాయగూడెం: జాతీయ ఉపకార వేతనానికి రెడ్డి గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి మడకం కృష్ణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రామారావు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్ఎంఎస్ ప్రతిభా పరీక్షల్లో కృష్ణ ఉత్తీర్ణత పొందినట్లు చెప్పారు. మడకం కృష్ణకు ఏటా రూ.12 వేల చొప్పున 4 సంవత్సరాలపాటు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. కాగా విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను హెచ్ఎం రామారావు అభినందించారు.

నేడు పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలన

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులను రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించనున్నారు. అనంతరం ప్రాజెక్టు పనులు, పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఓ భక్తురాలు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విశాఖపట్నంకు చెందిన జి.అన్నపూర్ణ భవాని ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల గురవయ్య

చింతలపూడి: జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతున్న సీపీఐ ఏలూరు జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఎండపల్లి గ్రామ శాఖ సమావేశం ఎస్కే మస్తాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కంచర్ల గురవయ్య మాట్లాడుతూ చింతలపూడి ప్రాంతంలో ఉన్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడం కోసం ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. సమావేశంలో మండల సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, పార్టీ సభ్యులు కొండా రామకృష్ణ, పేతురు, నరసింహులు చక్రబు బసవయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి


యూనియన్ ఆవిర్భావ వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ధర్మన్న భవనంలో యూనియన్ అధ్యక్షుడు బాలిన ధర్మరాజు కేక్ కట్ చేశారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి కోశాధికారి తీయాల గణేష్, కోట శివకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, కార్మికులకు గతంలో అమలు చేసిన పథకాలను పెంచి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎరుబండి వీర్రాజు, తారిపిరెడ్డి కృష్ణ, మానేపల్లి రామారావు, వనపర్ల నవీన్, అవనిగడ్డ ఆదిత్య, అల్లం వెంకటేష్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. రోడ్లు నిర్మానుష్యం


నిర్మానుష్యంగా మారిన జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రధాన రోడ్లు

జంగారెడ్డిగూడెం: జూన్ వచ్చినా వేసవి తాపం తగ్గడం లేదు. రుతుపవనాలు ముందుగానే వచ్చాయని సంతోష పడే లోపే అవి మొహం చాటేయడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ప్రతిరోజు క్రమంగా తప్పకుండా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. అయితే ఎండ వేడిమి మాత్రం 44 డిగ్రీలను తలపిస్తోంది. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అందరూ ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రజలు ఇళ్లకే పరిమితమవ్వడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ఏలూరు బస్ స్టేషన్‌లో వసతుల ఏర్పాటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పట్టణంలోని ఏలూరు కొత్త బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి రోజు 300 లీటర్ల చల్లటి మంచినీటితో పాటు, బస్టాండ్ ఏరియాలో రాత్రిపూట ఎంట్రన్స్ గేట్, ఎలైటింగ్ పాయింట్‌లో నూతన లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్టు ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బీ. వాణి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ సామాజిక బాధ్యతలో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన అధునాతన బీఎల్‌డీసీ ఫ్యాన్లను ఏర్పాటు చేశామన్నారు. వీటి వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు.